క్లుప్తంగా

ప్రత్యేక ఎల్‌పీఎంలకు దరఖాస్తు చేసుకోండి

కోడుమూరు రూరల్: మండలంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎం లున్న రైతులంతా ప్రత్యేక ఎల్‌పీఎంల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోడుమూరు తహసీల్దార్ నాగరాజు సూచించారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. మండలంలోని పులకుర్తి, వర్కూరు, అనుగొండ, అమడగుంట్ల, ముడుమలగుర్తి గ్రామాల్లో రీసర్వే పూర్తయిందన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ఉన్న జాయింట్ ఎల్‌పీఎంలను విభజించి ప్రత్యేక ఎల్‌పీఎంలను కేటాయించడం జరుగుతుందని, జాయింట్ ఎల్‌పీఎంలున్న రైతులంతా ఆయా గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఎల్‌పీఎం నంబర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



సి.బెళగల్ భవిత కేంద్రంలో దివ్యాంగులకు పరికరాలు అందజేస్తున్న ఎంఈఓ జ్యోతి

సి.బెళగల్: దివ్యాంగులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ఐఈఆర్‌టీలు సోమశేఖర్‌రెడ్డి, మద్దిలేటి దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ.. మండలంలోని దివ్యాంగ చిన్నారులకు భవిత కేంద్రంలో ప్రత్యేక విద్యా బోధనలు చేపడుతున్నామని, అదేవిధంగా వారికి అవసరమైన పరికరాలను సైతం ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలు కలిగిన నలుగురు దివ్యాంగ చిన్నారులకు వినికిడి యంత్రాలు, ఒక వీల్ చైర్‌ను అందజేశారు. ఐఈఆర్టీలతో పాటు ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీబీ పరీక్షలు చేయించుకోండి



టీబీపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నిస్సిగ్రేస్

కల్లూరు: టీబీ పరీక్షలు చేయించుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిస్సి గ్రేస్ సూచించారు. ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని కొల్లంపల్లి తండాలో గురువారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ ఇంటెన్సిఫైడ్ క్యాంపెయిన్ నిర్వహించి, టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ 60 ఏళ్లు పైబడిన వారు, బిఎంఐ18.5బిలో ఉన్న వారు, మధుమేహం, పొగ, మద్యం తాగేవారు, కర్మాగారాల్లో పని చేసే వారు గల్ల పరీక్షలు, ఎక్స్ రేలు తీయించుకోవాలన్నారు. టీబీ నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడి నయం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ స్వర్ణగౌరి, టీబీ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రింటర్ విరాళం

ఓర్వకల్లు: మండలంలోని ఉప్పలపాడు జెడ్పీ హై స్కూల్‌కు గ్రామానికి చెందిన దూదేకుల దస్తగిరి మహబూబ్ ఉస్సేన్(సాఫ్ట్‌వేర్ ఇంజినీర్) ఎల్రక్టానిక్ ప్రింటర్‌ను విరాళంగా అందజేశారు. వివాహ మహోత్సవం సందర్భంగా తాను చదువుకున్న పాఠశాలకు ప్రింటర్‌ను విరాళంగా ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం



వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

పాణ్యం: బదిలీపై వెళ్తున్న గగ్గటూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరామిరెడ్డిని గురువారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాలలో 1 నుంచి 5 తరగతుల్లో 30 మందికి పైగా విద్యార్థులు ఉన్నారన్నారు. ఇద్దరు ఉపాధ్యాయులలో ఒకరు బదిలీ కాగా ఒకరే ఉంటారని, మరో ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని కొచ్చెర్వు వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైనట్లు హైవే పోలీసులు తెలిపారు. పాణ్యం చెంచు కాలనీకి చెందిన హనుమంతు, వీరన్న, వీరయ్య ద్విచక్ర వాహనంపై వెళ్తూ కొచ్చెర్వు వద్ద ఉన్న యూటర్న్ మలుపు వద్ద బర్రెలు అడ్డు రావడంతో అదుపు తప్పి కింద పడ్డారన్నారు. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రైతులకు అన్యాయం జరగనివ్వం



మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం: బాధిత రైతులకు అన్యాయం జరగనివ్వమని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పిన్నాపురంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో 2467.28 ఎకరాలు భూములను గ్రీన్‌కో సంస్థకు ఇచ్చారన్నారు. వీటిలో ప్రభుత్వ భూమి కూడా ఉందన్నారు. 2008 నుంచి 2018 మధ్యలో ఆయా భూముల్లో సాగులో ఉన్న రైతులకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. సోలార్ పరిశ్రమకు కేటాయించిన 212/ఎ 403, 413, 415, 422, 426, 429, 431 సర్వే నంబర్లలో 271.25 ఎకరాలు భూమిలో 195 మంది రైతులు సాగు చేసుకున్నట్లు శాటిలైట్ ద్వారా గుర్తించి జాబితాను రూపొందించామన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. కాగా కొన్నేళ్లుగా తాము సాగులో ఉన్నప్పటికీ జాబితాలో తమ పేర్లు లేవని కొందరు రైతులు సభ దృష్టికి తెచ్చారు. గ్రామ సభ పోలీస్ బందోబస్త్ మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐలు నరేంద్రకుమారెడ్డి, నాగార్జురెడ్డి, మండల సర్వేయర్ నాగరాజు, డీటీ శివశంకర్‌రెడ్డి, ఆర్ఐ రామ్, సర్పంచ్ యల్లక్రిష్ణయ్య పాల్గొన్నారు.

భూసేకరణ చట్టం అమలు చేయాలి

సోలార్ పరిశ్రమకు భూములిచ్చిన పిన్నాపురం రైతులకు 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని రైతుల సంఘం నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సహాయ కార్యదర్శి రామచంద్రుడు, ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, ప్రసాద్, కృష్ణ, మాసమయ్య, శ్రీను, నారాయణ, రమేష్ తదితరులు తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోలార్ పరిశ్రమకు భూములు కేటాయించడం వల్ల రైతులు, కూలీలు ఉపాధి కోల్పోయారన్నారు. పరిశ్రమ యాజమాన్యం పునరావసం కల్పించడంలో నిర్లక్ష్యం వహించిందన్నారు. గ్రామంలో తాగునీరు, రోడ్లు, పొలాలకు వెళ్లే రస్తాలు, ట్యాంక్‌ల నిర్మాణం మరిచిందన్నారు. ఇప్పటికైనా సోలార్ యాజమాన్యం అన్యాక్రాంతం చేసిన నీటి కుంటలను అభివృద్ధి చేయాలని, సోలార్ పరిశ్రమలో యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. 212 సర్వే నంబర్‌తోపాటు మిగతా సర్వే నంబర్‌తో సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వాలన్నారు. నూతన జాబితాలో పేర్లు లేని రైతులను జాబితాలో చేర్చేందుకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సహాయ కార్యదర్శి రామచంద్రుడు, ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, ప్రసాద్, కృష్ణ, మాసమయ్య, శ్రీను, నారాయణ, రమేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది

- డీఈఓ శామ్యూల్ పాల్

ఓర్వకల్లు: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి అత్యంత గౌరవ ప్రథమైనదని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ అన్నారు. మండలంలోని నన్నూరు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ప్రధానోపాధ్యాయునిగా పనిచేసిన ప్రాణేష్ కుమార్ గత మే 30న పదవీ విరమణ చెందిన సందర్భంగా గురువారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత ప్రధానోపాధ్యాయురాలు నిర్మల వసంతకుమారి ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమానికి డీఈఓతోపాటు, ఎంఈఓలు ఓంకార్ యాదవ్, శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు, పదవీ విరమణలు సర్వసాధారణమే అన్నారు. ఇక్కడ హెచ్‌ఎంగా పనిచేసిన ప్రాణేష్‌కుమార్ విద్యార్థుల ఉత్తీర్ణతకు ఎంతో కృషి చేశారని, ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం ప్రాణేష్ కుమార్ దంపతులను సన్మానించారు.

జీవాలను కాపాడుకోండి



జీవానికి నట్టల నివారణ మందు తాపుతున్న డాక్టర్

గడివేముల: నట్టల నివారణ మందు తాపించి జీవాలను కాపాడుకోవాలని పెసరవాయి పశువైద్యాధికారి బాబా ఫక్రుద్దీన్ రైతులకు సూచించారు. గురువారం మండల పరిధిలో జీవాలకు నట్టల నివారణ వ్యాధి టీకాల కార్యక్రమం ప్రారంభించారు. పెసరవాయి గ్రామంలో గొర్రెలు, మేకలకు సర్పంచ్ శేఖర్ చేత నట్టల నివారణ మందును తాపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వచ్చే నెల 10వ తేదీ వరకు ఉచిత నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమం ఉంటుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు అన్ని సౌకర్యాలు



మాట్లాడుతున్న మన్సూర్

కర్నూలు(అర్బన్): సౌత్ ఇండియా హజ్, ఉమ్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్రా, హజ్‌కు వెళ్లే భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు హజ్ కమిటీ డైరెక్టర్ మన్సూర్ చెప్పారు. గురువారం స్థానిక ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ అసోసియేషన్‌ను కర్ణాటక రాష్ట్రంలో ప్రారంభించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో విస్తరించామన్నారు. ఈ అసోసియేషన్ ద్వారా భక్తులకు నాణ్యమైన సేవలు అందుతాయన్నారు. కొందరు ఏజెంట్ల రూపంలో హజ్ యాత్రకు వెళ్లే భక్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అలాంటి ఇబ్బందులను నివారించేందుకు అసోసియేషన్ ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జాఫర్ మోహిద్దీన్, షా ఫైషల్, మహమ్మద్ ఫయాజ్, సుల్తాన్, షేక్ ఫయాజ్, అబ్దుల్ జలీల్‌తో పాటు సౌత్ ఇండియా నుంచి హజ్ టూర్ ఆపరేటర్స్ పాల్గొన్నారు.

నేడు నేర సమీక్ష సమావేశం

కర్నూలు: జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో శుక్రవారం నేర సమీక్ష సమావేశం (క్రైం మీటింగ్) జరగనుంది. ఈ మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలకు డీపీఓ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గత నెలలో నమోదైన కేసులతో పాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, రోడ్డు ప్రమాదాలు, డ్రంకెన్ డ్రైవ్, సైబర్ నేరాలు, విచారణ దశలో ఉన్న కేసులు, హత్యలు, అత్యాచారాలు, ఇంటి దొంగతనాలు, చైన్ స్నాచింగ్స్, మహిళా నేరాలు తదితర కేసులపై ఎస్పీ సమీక్షించి కేసుల పరిష్కారానికి దిశా నిర్దేశం చేయనున్నారు. జిల్లాలో 4 పోలీస్ సబ్‌డివిజన్లు, 9 పోలీస్ సర్కిళ్లు, 15 అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్లు, 38 పోలీస్ స్టేషన్లు, 4 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. వాటి పరిధిలో నమోదైన అన్ని రకాల కేసులను ఎస్పీ సమీక్షించనున్నారు. డీసీఆర్‌బీ, డీఎస్‌బీ, డీటీఆర్‌బీ, ఎస్బీ, ఎస్టీ సెల్, ఫ్యాక్షన్ జోన్, మహిళా పీఎస్, కర్నూలు పోలీసు శిక్షణ కళాశాల (డీటీసీ) అధికారులు సమావేశంలో పాల్గొననున్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ ఓల్డ్‌సిటీ ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఆ రోజు నగరంలో జరిగే ఆందోళనల్లో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనాలని కోరారు. గురువారం సుర్జీత్ భవన్‌లో సీఐటీయూ ఓల్డ్‌సిటీ కమిటీ ఆఫీసు బేరర్ల సమావేశాన్ని అధ్యక్షుడు అబ్దుల్‌దేశాయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్రాల్లోని కూటమి ప్రభుత్వాలు కార్మికులపై నిరంకుశ వైఖరిని అవలంబిస్తున్నాయని విమర్శించారు. 1986లో అమెరికాలోని చికాగో సమావేశంలో సాధించుకున్న 8 గంటల పని విధానానికి స్వస్తి చెప్పడం అన్యాయమన్నారు. పది గంటల పని విధానంతో మహిళలు రాత్రిళ్లు కూడా ఉద్యోగాలు చేయాలా? అని ప్రశ్నించారు. కార్మికులు ప్రాణత్యాగం చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేయడం అన్యాయమని, వాటి స్థానంలో ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు చాంద్‌బాషా, సూరి, మహబూబ్‌బాషా, నాసిర్, సాధిక్ పాల్గొన్నారు.

రైతుబజారులో రైతులకే స్థానం



భూపాల్‌నగర్‌లో ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న ఆర్‌బీహెచ్‌సీ శివకుమార్

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యాన రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి రైతుబజారులో ఉత్పత్తులను అమ్ముకునేందుకు అవకాశం కల్పిస్తామని రైతుబజార్ల హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తెలిపారు. గురువారం కర్నూలు రూరల్ మండలంలోని భూపాల్ నగర్, మిలిట రీ కాలనీ, నందనపల్లి, పడిదెంపాడు, నందనపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు సాగుచేసిన ఉద్యాన పంటలను ఆయన పరిశీలించారు. రైతుబాజరులో కూరగాయలు అమ్ముకునేందుకు అవకాశం ఇవ్వాలని కొందరు రైతులు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో రైతులు సాగు చేసిన కూరగాయల పంటలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిజమైన రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామన్నారు. కొత్తగా ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు రైతుబజారులో కూరగాయలను అమ్ముకునేందుకు ధరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు సీ.క్యాంపు రైతుబజారు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలులోని సి.క్యాంపు రైతుబజారును శుక్రవారం ఒక్కరోజు బంద్ చేస్తున్నట్లు ఎస్టేటు ఆఫీసర్ కళ్యాణి, హార్టికల్చ ర్ కన్సల్టెంటు శివకుమార్ తెలిపారు. రైతు బజారులో శుభ్రతకు పెద్దపీట వేస్తున్నామని, క్లీనింగ్ నిమిత్తం ఒక్కరోజు సెలవు ప్రకటించినట్లు వారు గురువారం ఒక ప్రకటనలో తెలిపా రు. వినియోగదారులు, రైతులు, పొదుపు మహిళలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. శనివారం నుంచి రైతుబజారు యథావిధిగా పనిచేస్తుందని పేర్కొన్నారు.

సమ్మె విరమించాలంటూ ఒత్తిళ్లు

- మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులపై అధికారుల ఆగ్రహం
- తాత్కాలిక సిబ్బందిని నియమిస్తామంటూ వాట్సాప్‌లో నోటీసులు



వాట్సాప్‌లో హల్‌చల్ చేస్తున్న తేదీ లేని నోటీసులు

కర్నూలు (టౌన్): 'మూడు రోజుల క్రితం నగర పాలక ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే ఓ అధికారి కార్మికులను తన చాంబర్‌కు పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మె విరమించుకోవాలని లేకుంటే టెంట్ పీకేస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. మరోవైపు ఇంకో అధికారి అనధికారిక నోటీసుల్లో విధులకు గైర్హాజరు అయితే తాత్కలిక సిబ్బందిని నియమించుకొని వారిని అప్‌కాస్‌లో చేరుస్తామంటూ భయపెడుతున్నారు. వాస్తవానికి ప్రత్యామ్నాయ సిబ్బందిని నియమించుకొని ఏర్పాట్లు చేయాల్సిన ఇంజినీరింగ్ అధికారులు కార్మికులను బెదిరించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.'

ఒకటి కాదు. రెండు కాదు. 51 రోజులుగా మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ ఆందోళనలు చేస్తున్నారు. నిరసనలు తెలుపుతున్నారు. టెంటు వేసుకొని ధర్నాలు చేశారు. దీనిపై రాష్ట్ర నాయకత్వం మున్సిపల్ మంత్రి నారాయణతో మాట్లాడారు. చేస్తాం.. చూస్తాం.. అంటూ కాలయాపన చేస్తున్నారు తప్పా.. సమస్యను పరిష్కరించడం లేదు. విధిలేని పరిస్థితుల్లో కార్మికులు విధులను బహిష్కరించి రోడ్డెక్కారు. కర్నూలు నగరంలో ర్యాలీలు చేశారు. కలెక్టరేట్ వద్ద పిల్లపాపలతో నిరసనలు వ్యక్తం చేశారు. అయినా ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెక్కినట్లు వ్యవహరిస్తున్నందున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తమకు వేతనాలు రూ.13 వేల స్థానంలో రూ.29 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను తమ కుటుంబాలకు వర్తింపజేయాలని కోరుతున్నారు. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. నగర పాలకలో వాటర్ వర్క్స్, వీధిలైట్లు, పార్కుల నిర్వహణ, కంప్యూటర్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఇలా 363 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారంతా ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు.

కార్మికులపై తీవ్ర ఒత్తిళ్లు

ఇప్పటికే ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికులకు ఒత్తిళ్లు ప్రారంభమయ్యాయి. విధుల్లో చేరాలని, లేకుంటే తొలగిస్తామన్న సంకేతాలు కార్పొరేషన్ వాట్సప్ గ్రూపుల్లో హల్‌చల్ చేస్తున్నాయి. సమ్మెలో ఉన్న కార్మికుల స్థానంలో తాత్కాలిక సిబ్బందిని నియమించి అప్‌కాస్‌లో చేరుస్తామని అధికారులు అనధికారికంగా వాట్సప్‌లో హెచ్చరికలు చేస్తున్నారు. అయితే తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేస్తున్నారు.

తీవ్రమైన తాగునీటి సరఫరా, వీధి లైట్ల సమస్య

కార్మికుల సమ్మె 51 రోజులకు చేరినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. ఇప్పటికే కర్నూలు నగరంలోని పలు వార్డుల్లో తాగునీటి సమస్య తీవ్రమైంది. నీటి సరఫరాలో వాటర్ వర్క్స్ ఇంజినీర్లు చేతులెత్తేశారు. పలు కాలనీలలో ఇబ్బందులు పెరుగుతున్నాయి. మంత్రి టీజీ భరత్ ఉంటున్న కొత్తపేటలో మంచినీటి సరఫరా లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి ప్రాతినిధ్యం వహించే కల్లూరు కాలనీలలో తాగునీటి ఇక్కట్లు తీవ్రమయ్యాయి. కాలనీలలో వీధి లైట్లు వెలగడం లేదు. ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు. మంత్రి ఏరియాలో మాత్రం తాగునీరు, వీధి లైట్ల సమస్య రాకుండా అధికారులు చూస్తున్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి



ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్లు

కోడుమూరు రూరల్: యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, నాయమూర్తి లీలా వెంకటశేషాద్రి సూచించారు. గురువారం గూడూరు మండలంలోని విశ్వభారతి మెడికల్ కళాశాలలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల చేత మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. నాయమూర్తి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతినడంతో పాటు, విలువైన జీవితాన్ని కోల్పోవాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను తెలుసుకుని వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అలాగే విద్యార్థులంతా ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, ర్యాగింగ్ వల్ల కలిగే నష్టాలను వివరించడంతో పాటు, ర్యాగింగ్ పాల్పడిన వారిపై చట్టం విధించే శిక్షలను వివరించారు. శాశ్వత, లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, నోడలాఫీసర్ డాక్టర్ మునీరుద్దీన్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణనాయక్, సైక్రియాటిస్ట్ డాక్టర్ శివశంకర్ రెడ్డి, వలంటీర్ రాయపాటి శ్రీనివాస రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

కల్లూరు: మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు అవుతాయని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. గురువారం ఉలిందకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరదాగా మొదలయ్యే మాదక ద్రవ్యాల వినియోగం క్రమంగా వ్యసనంగా మారి బానిసలు అవుతున్నారన్నారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల మానసిక, ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు నవీన్, ప్రధానోపాధ్యాయులు లీలావతి, ఆరోగ్య విస్తరణ అధికారి విజయ్‌కుమార్, క్షేత్రస్థాయి పర్యవేక్షకులు మద్దమ్మ, ఆరోగ్య కార్యకర్త పద్మావతి, ప్రాజెక్టనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం చిత్తు



మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం: మత్తు పదార్థాలతో జీవితం చిత్తవుతుందని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంఈఓ -2 సుబ్రహ్మణ్యం, సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. గురువారం పాణ్యంలో ఇంటర్, డిగ్రీ కళాశాల విద్యార్థులచే ఈగల్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో చెడు వ్యసనాల జోలికి వెళ్లరాదన్నారు. అనంతరం కళాశాల నుంచి నాలుగు కూడళ్ల వద్ద మానవహారంగా ఏర్పడి ప్రజలకు అవగాహన కల్పించారు.

వానలు లేక రైతన్నల ఆందోళన



వర్కూరులో వర్షాధారం కింద సాగు చేసిన పత్తి పంట

- ముఖం చాటేసిన వరుణుడు
- వాడుముఖం పట్టిన పంటలు

కోడుమూరు రూరల్: ఖరీఫ్‌కు ముందస్తుగా కురిసిన వానలకు మండలంలోని రైతులు పత్తి, కంది విత్తనాలను సాగు చేశారు. ప్రస్తుతం ఏ గ్రామంలో చూసిన పత్తి పంట సాగు చేసి 20 నుంచి 30 రోజులవుతోంది. ఈ తరుణంలో వానలు ఆశించిన మేర కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వానలు పడ్డా అరకొరగా కురుస్తుండడంతో సాగు చేసిన పంటలకు అవి ఏమాత్రం సరిపోవడం లేదు. మరో నాలుగైదు రోజుల్లో భారీ వర్షాలు కురవకపోతే ఖరీఫ్ కింద ముందస్తుగా సాగు చేసిన పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఇప్పటికే గతేడాది వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు నష్టపోయిన రైతులు ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు చూసి మరింత ఆందోళన చెందుతున్నారు.

రేషనలైజేషన్‌పై స్పష్టత ఇవ్వండి



సి.బెళగల్‌లో ఎంపీడీఓ రాణెమ్మకు వినతిపత్రం ఇస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

సి.బెళగల్: తమ విధులపై స్పష్టమైన విధానాలను తెలియజేసి రేషనలైజేషన్ చేపట్టాలని గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని ఆయా గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు మండల పరిషత్ కార్యాలయం చేరుకుని ఎంపీడీఓ రాణెమ్మకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. రాష ప్రభుత్వం రేషనలైజేషన్ పేరిట సచివాలయాల కుదింపు, ఉద్యోగుల సర్దుబాటు చేస్తోందని అయితే తమ విధుల నిర్వహణపై స్పష్టత లేదన్నారు. తమ విధులపై స్పష్టమైన విధానాలను తెలియజేసి రేషనలైజేషన్ చేపట్టాలని కోరారు. ప్రస్తుతం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, గృహ నిర్మాణ, సర్వశిక్ష అభియాన్ వంటి వివిధ శాఖలలో విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బీఎల్వోల విధులు, అప్పటికప్పుడు వివిధ శాఖలు నిర్వహించే సర్వేలు, ఈ-కేవైసీ లాంటి అదనపు పనులను కూడ చేస్తున్నామని, దీంతో తమపై పనిభారం పడిందన్నారు. ఇలాంటి సమయంలో రేషనలైజేష వల్ల సచివాలయాల్లో ఇద్దరు, ముగ్గురు చేసే పని ఒక్క ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పైనే పడుతుందని, పని ఒత్తిడి కలిగించే విధానాలను ప్రభుత్వం మానుకుని, ఆరు సంవత్సరాలుగా పనిచేస్తున్న తమకు పదోన్నతుల మార్గదర్శకాలను విడుదల చేసి, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. బదిలీలలో సొంత మండలంలో పనిచేయకూడదన్న నింబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయా గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు రంగన్న, మనోజ్‌కుమార్‌రెడ్డి, శ్రీరాములు, ఇమ్మానియేల్, మాధురి తదితరులు ఉన్నారు.

రికార్డులను సక్రమంగా నిర్వహించాలి



సి.బెళగల్‌లో ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాణెమ్మ

సి.బెళగల్: ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బంది మండలంలో చేపట్టిన పనుల రికార్డులను, రిపోర్టులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ రాణెమ్మ సూచించారు. ఆమె గురువారం తన కార్యాలయంలో ఏపీఓ రామన్నతో కలిసి మండల ఉపాధి హామీ టీఏలు, ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. త్వరలో మండలంలోని గ్రామాల్లో ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, తనిఖీలకు అవసరమైన వర్క్‌ఫైల్స్, ఎం బుక్కులు, పని ప్రోగ్రెస్ ఫొటోలను, గ్రామ పంచాయతీ పనుల నిర్వహణలోని ఏడు రికార్డులను, పనులను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ ఆదేశించారు. అదేవిధంగా గ్రామాల్లో పండ్లు, పూలతోటల సాగుకు ముందుకు వచ్చే రైతులను గుర్తించి, మొక్కలను నాటించాలని సూచించారు. సమీక్షలో ఈసీ రంగస్వామి, టీఏలు రామ్‌శంకర్‌నాయక్, మురళీ, ఉమా మహేశ్వరి, లక్ష్మి, ఎఫ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాలను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



గూడూరులో విత్తన దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ దస్తగిరిరెడ్డి

కోడుమూరు రూరల్: ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకు కాకుండా రైతులకు విత్తనాలను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని గూడూరు మండల వ్యవసాయాధికారి దస్తగిరిరెడ్డి దుకాణదారులను హెచ్చరించారు. ఆయన గురువారం గూడూరులోని విత్తన దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి విత్తనాలకు సంబంధించిన స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ దుకాణదారులు వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న పత్తి, కంది విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. ఎమార్పీ కంటే ఎక్కువ రేట్లకు విక్రయించరాదని, విత్తనాలు విక్రయించే సమయంలో తప్పనిసరిగా రైతులకు రసీదులివ్వాలని, రైతులు అడిగిన విత్తనాలను మాత్రమే ఇవ్వాలని ఏఓ సూచించారు. అలాగే ప్రతిరోజు సరుకు ఎంత ఉందో స్టాక్ బోర్డులో కనబర్చాలని దుకాణదారులను ఆదేశించారు. అనంతరం కొన్ని రకాల పత్తి విత్తనాల ప్యాకెట్లను టెస్టింగ్ నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు.